ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



రాయితీ పండుగ



కురవి మండలం రాజోలులో ఉపాధి హామీ పథకంలో సాగు చేస్తున్న మామిడితోట

- 'ఉపాధి హామీ'లో పండ్లతోటల పెంపకం
- చిన్న, సన్న కారు రైతులే అర్హులు
- సాగుకు సబ్సిడీ అందిస్తున్న కేంద్రం
- ఈ ఏడాది జిల్లాలో 200 ఎకరాల టార్గెట్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 20 : జిల్లాలో రైతులు పండ్లతోటల పెంపకంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా సాగు చేయడానికి కేంద్రం రాయితీ ఇస్తోండటంలో మొగ్గు చూపుతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ (ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ఎ) నుంచి నిధులను అందిస్తోంది. మహబూబాబాద్ జిల్లాలో ఐదుఎకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్న సన్నచిన్నకారు రైతులు అర్హులుగా ప్రకటించింది.

గత ఏడాది 175 ఎకరాల్లో..

2006 సంవత్సరంలో కేంద్రంలోని అప్పటి యూపీఏ ప్రభుత్వం గ్రామీణ కూలీలు వలసలు వెళ్లకుండా నివారించి, ఊళ్లలోనే పనులు కల్పించేందుకు ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చింది. క్రమక్రమేణా ఉపాధి పనులతో పాటు ఇతర అవసరాల కోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను కేటాయిస్తున్నారు. అందులో భాగంగానే ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగివున్న సన్న, చిన్నకారు రైతుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని పండ్లతోట పెంపకానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను కేటాయిస్తూ వందశాతం సబ్సిడీలను అందిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 175 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేయగా ఈ సంవత్సరం 2024-25 ఆర్థిక సంవత్సరంలో 200 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా జిల్లాలకు టార్గెట్‌ను కేటాయించింది.

మహబూబాబాద్ జిల్లాలో పండ్లతోటలు సాగుచేసుకునే రైతులకు మామిడి, సపోట, జామ, నిమ్మ, కొబ్బరి, మునిగ, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్, యాపిల్‌బేర్, దానిమ్మ, కొబ్బరితో పాటు ఇతర పండ్ల మొక్కలను ఉచితంగా ఉపాధి పథకంలో కేంద్రప్రభుత్వం అందిస్తున్నది. మొక్కలు నాటేందుకు గుంత లు, రవాణా, కూలీల ఖర్చులతో పాటు వాటిని సంరక్షించేందుకు మూడు సంవత్సరాల పాటు మెయింటెన్స్ ఖర్చులను అందించనున్నారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకుంటే అధిక దిగుబడితో ఆర్థిక పురోగతి సాధించవచ్చు.

మొక్కల పంపిణీ ఇలా..

జిల్లాలోని తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగిన సన్నచిన్నకారు రైతులు (5 ఎకరాల్లోపు మాత్రమే) ఈ పథకానికి అర్హులు. పండ్ల మొక్కలను ఉచితంగా అందిస్తూ మూడుసంవత్సరాల పాటు మెయింటెనెన్స్ ఖర్చులను కూడా కేంద్రప్రభుత్వమే భరిస్తుంది. మునిగే తోటలను పెంచాలనుకునే రైతులు ఎకరంలో వెయ్యి మొక్కలను మాత్రమే నాటాల్సి ఉంటుంది. ప్రభుత్వం కూడా ఎకరానికి మాత్రమే పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేయనుంది. ఎకరంలోపు మామిడితోటను సాగు చేసేందుకు 70 మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. బతికిఉన్న ఒక్కొక్క మొక్కకు నెల మెయింటెన్స్ కోసం రూ.15 చొప్పున, నెలకు రూ.3వేలకు మించకుండా ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇలా మూడు సంవత్సరాలు కలిపి రూ.60 వేలను అందించనుంది. నిమ్మసాగు కోసం ఎకరానికి 110 మొకలు అందిస్తారు. మూడేళ్లకు కలిపి రూ.70 వేల అందించనున్నారు.

జామ ఎకరానికి 110 మొక్కలు కేటాయిస్తూ.. మూడేళ్లకు రూ.90 వేలు, కొబ్బరిసాగు చేసేందుకుఎకరంలో 80 మొక్కలు అందించనున్నారు. మూడు సంవత్సరాలకు రూ.62 వేలు అందించనున్నారు. డ్రాగన్‌ఫ్రూట్ కోసంఆరెకరంలో వెయ్యి మొక్కలు అందిస్తారు. వాటి సంరక్షణ కోసం మూడు సంవత్సరాలకు రూ.2.50 లక్షలు ప్రభుత్వం సాగుచేసే రైతులకు అందించనుంది.



దంతాలపల్లి మండలం బొడ్లాడలో జామతోట

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

ఉపాధిహామీ పథకంలో పండ్ల తోటల పెంపకం, తీగజాతి కూరగాయల సాగు పందిర్ల కోసం కేంద్రప్రభుత్వం నిధులు అధిక మొత్తంలో వెచ్చిస్తోంది. పండ్లు, కూరగాయల సాగు రైతులు ఆయా మండలాల్లోని ఎంపీడీవోలకు, ఏపీవోలకు పట్టాపాస్‌పుస్తకం, గ్రామ తీర్మాణం, దరఖాస్తు పత్రం, భూమి సైడ్ ఫొటో, ఉపాధిహామీ కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం జిరాక్స్‌లను అందిస్తే 15 రోజుల నుంచి 20 రోజుల వ్యవధిలో దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి వారి వారి అకౌంట్‌లలో డబ్బులు జమ అవుతాయి.

మామిడితోటను సాగు చేశా..

- చిట్టి రమణారెడ్డి
మామిడి రైతు, బొడ్లాడ, దంతాలపల్లి మండలం



జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా 2022లో తనకున్న నాలుగున్నర ఎకరాల్లో 305 మామిడి మొక్కలను సాగు చేశాను. మొక్కలు కొనుగోలు, రవాణా ఖర్చులు, గుంతలు తీసేందుకు, మూడు సంవత్సరాల వరకు మామిడి మొక్కల సంరక్షణ కోసం నెలకు రూ.3 వేలకు మించకుండా మూడేళ్ల పాటు అందిస్తున్నారు. దీంతో సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంది. దీంతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాం.

పెళ్లి బస్సు ఢీకొని..

తండ్రి, తనయుడి మృతి

శుభకార్యానికి వెళ్లివస్తుండగా ఘటన



తండ్రి జక్కుల హరీష్, కుమారుడు తేజ (ఫైల్)

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 20 : పెళ్లి బస్సు ఢీకొని తండ్రీకొడుకులు మృతి చెందిన ఘటన తొర్రూరు మండలం మాటేడు గ్రామశివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం. చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన జక్కుల హరీష్ (35) తన కుమారుడు జక్కుల తేజ (5)ను తీసుకుని ద్విచక్రవాహనంపై తొర్రూరు మండల కేంద్రంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మాటేడు గ్రామశివారులో ఎదురుగా వచ్చిన ఖమ్మం జిల్లాకు చెందిన ట్రావెల్ పెళ్లి బస్సు వారి ద్విచక్రవాహనాన్నిఢీకొట్టడంతో తండ్రికొడుకు ఇద్దరూ అక్కడిక్కడే మృతి చెందారు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబసభ్యులు, బంధుమిత్రుల రోదనలు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుడికి భార్య గౌతమి, తల్లిదండ్రులు మల్లయ్య, అయిలమ్మ ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాలను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నాడని ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

కాగా, మృతుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా, వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు, మృతుడికి ఇద్దరు కుమారులు. మొదటి కొడుకు వెంకటేష్, రెండోకుమారుడు నవతేజ్ (మృతుడు) ఉన్నారు. తండ్రికొడుకుల దుర్మరణంతో గుండంరాజు పల్లి గ్రామంలో విషాదం నెలకొంది.



శనివారం ఉష్ణోగ్రత

గరిష్ఠం : 31.5°C

కనిష్ఠం : 27.0°C



తల్లికి భారం కాకూడదని..

గూడూరులో యువతి ఆత్మహత్య



అఖిల (ఫైల్)

గూడూరు, ఏప్రిల్ 20 : తనకు పెళ్లిచేసే ఆర్థిక స్తోమత తల్లికి లేదని, తల్లికి భారం కాకూడదన్న మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గూడూరు మండ లకేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగింది. గూడూరు ఎస్‌ఐ నగేష్ తెలిపిన వివరాల ప్రకారం. ఎస్సీ కాలనీకి చెందిన బండారి చెన్నకేశవులు, లలిత దంపతులకు అఖిల (19) సంతానం. చెన్నకేశవులు కొన్నేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. తనకు పెళ్లి చేసే స్థోమత తల్లికి లేదని, ఆమెకు భారం కాకూడదన్న క్షణికావేశంలో శుక్రవారం రాత్రి తల్లి, నానమ్మ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఇంటి రేకులకు ఉన్న ఇనుప రాడ్డుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పేదలను ఆదరించే ఏకైక పార్టీ కాంగ్రెస్సే

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న భూక్య మురళీనాయక్

గూడూరు, ఏప్రిల్ 20 : పేదలను ఆదరించే ఏకైక పార్టీ కాంగ్రెస్సేనని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. గూడూరు మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన జనజాతర భారీ బహిరంగ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరై, పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారని పేర్కొన్నారు. ఏకకాలంలోనే రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయనున్నట్లు తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పార్టీ బలపరిచిన పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపుకు కృషి చేయాలన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాహుల్‌గాంధీ పాదయాత్ర చేశారని, ఈ పాదయాత్రకు అపూర్వ స్పందన లభించిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జనజాతర సభ సక్సెస్ కోసం కృషి చేసిన కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జిల్లా, మండల నాయకులు మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, చిట్టి వెంకటేశ్వర్లు, బొల్లికొండ మధు, కొమ్మాలు, శ్రీపాల్‌రెడ్డి, యాకయ్య, శ్రీనివాస్, పలు గ్రామాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాహనం తనిఖీ..

గూడూరు మండలకేంద్రంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ వాహనాన్నిఎస్సై నగేష్ తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా వాహనాన్ని తనిఖీ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

- స్వీప్ నోడల్ అధికారి మరియన్న

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 20 : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ప్రతీ ఒక్కరు తమఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారి మరియన్న అన్నారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాలతోమహబూబాబాద్ పట్టణంతో పాటు గూడూరు మండలంలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటుహక్కు నమోదు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో స్వీప్ నోడల్ అధికారి మరియన్న ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని ఓటర్లంతా ఓటుహక్కు వినియోగించుకుని పోలింగ్ శాతాన్ని పెంచాలన్నారు. గూడూరు మండలంలోని లక్ష్మీపురంలో అంగన్‌వాడీ కేంద్రంలో రంగోలిని నిర్వహించారు. ఈ యకార్యక్రమంలో డీడబ్ల్యూవో వరలక్ష్మి, సీడీపీవో నీలోఫర్, శ్యామ్, అశోక్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

వందరోజుల పాలనలో కాంగ్రెస్‌పై వ్యతిరేకత

- బీఆర్‌ఎస్ వీడిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి గెలవాలి
- మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 20 : రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి వందరోజుల పాలనలో కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ ఆరోపించారు. అందుకు ఉదాహరణే మానుకోటసభ అని, చరిత్రలో లేనివిధంగా జనం కోసం ముఖ్యమంత్రి గంటకుపైగా వేచి ఉన్నారని చెప్పారు. మహబూబాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా మానుకోటకు వస్తున్నారని, ఇక్కడ వరాల జల్లు కురిపిస్తారని ఎదురు చూసిన ప్రజల ఆశలపై నీళ్లు చల్లారని విమర్శించారు.

స్వార్థ ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్‌ను వీడిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు దమ్మింటే వారి పదవులకు రాజీనామా చేసి మళ్లీ గెలవాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న మానుకోటలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా మాలోతు కవిత నామినేషన్ వేస్తున్నారని, పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

మానుకోట సభతో ఫలితం తేలిపోయింది..

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మానుకోటలో కాంగ్రెస్ సభతోనే పార్లమెంట్ ఎన్నికల ఫలితం తేలిపోయిందని ఎమ్మెల్సీ తక్కెళ్లపలి రవీందర్‌రావు అన్నారు. మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ కలిసికట్టుగా పని చేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుందామని చెప్పారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బింధు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్డీ. ఫరీద్, ముత్యం వెంకన్న, ఎడ్ల వేణుమాధవ్ పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలి

- రాష్ట్ర ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకుడు రవీంద్రనాయక్



రికార్డులను పరిశీలిస్తున్న రవీంద్రనాయక్

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 20 : జిల్లాలో ప్రజాఆరోగ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని రాష్ట్ర ప్రజాఆరోగ్య కుటుంబ సంక్షేమ సంచాలకుడు రవీంద్రనాయక్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో తనిఖీలు చేపట్టి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ముందు వరుసలో ఉంచాలని సూచించారు. ట్రైబల్ ఆరోగ్య కేంద్రాలలో సికెల్‌సెల్, ఎనిమియా కేసులను నమోదు చేయాలని, కీటక నియంత్రణ వ్యాధుల అదుపుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఫోకల్ స్ప్రే కార్యక్రమం, డ్రై డే.. ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం వెనుకబడిన ఆరోగ్య కేంద్రాలను గుర్తించి వంద శాతం పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయి ఉద్యోగులకు ఇవ్వాల్సిన శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలని, జాతీయ టీబీ కార్యక్రమంలో డీబీటీ పూర్తి చేయాలన్నారు. క్లినికల్ కేర్, ఎస్టాబిస్‌మెన్ చట్టం ప్రకారం.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ హోమియో, ఆయుర్వేద, సిద్ధ యోగ, ఫిజియోథెరపి క్లీనిక్‌లను విధిగా రిజిస్టర్ చేయాలని సూచించారు. రిజిస్టర్ కానీ క్లినిక్ కేంద్రాలను వెంటనే రిజిస్టర్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో బీకళావతిబాయి, ప్రోగ్రాం అధికారులు అంబరీష, మురళీధర్, సుధీర్‌రెడ్డి, బిందుశ్రీ, విజయ్, శ్రావణ్, ప్రసాద్, రవీందర్‌రావు, మంగమ్మ, రుక్మోద్దీన్, వసంత, పురుషోత్తం పాల్గొన్నారు.



డీజే నిర్వాహకుడిపై కేసు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 20: పెళ్లి ఊరేగింపులో అర్ధరాత్రి డీజే సౌండ్స్‌తో ప్రజలను ఇబ్బందిపెడుతున్న డీజే నిర్వాహకుడితోపాటు పెళ్లివారిపై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. హనుమకొండ పోచమ్మకుంట ఫైన్ ఫంక్షన్ హాల్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి డీజేతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు డీజే ప్రాంతానికి చేరుకొని నిర్వాహకుడు తాటికొండ సాయి, పెళ్లి వారి నుంచి ముత్తోజ్ అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాజీపేట జంక్షన్ మీదుగా సమ్మర్ స్పెషల్ రైళ్లు

కాజీపేట, ఏప్రిల్ 20 : రైళ్లలో వేసవి రద్దీ దృష్ట్యా పలు సమ్మర్ స్పెషల్ రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ - దానాపూర్ రైలు ఏప్రిల్ 28, మే 2, 9, 16, 23, 30, జూన్ 6, 13, 20, 27 తేదీల్లో నడుస్తుంది. ఈ రైలు కాజీపేటలో నిర్ణయించిన తేదీల్లో ఉదయం 10 గంటలకు హాల్టింగ్ ఉంటుంది. దానాపూర్ - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 21, 28, మే 5, 12, 19,28, జూన్ 2, 9, 16, 23, 30 తేదీలలో నడుపనున్నారు. ఈ రైలు నిర్ణయించిన తేదీల్లో కాజీపేటకు మధ్యాహ్నం 1 గంటలకు హాల్టింగ్ సౌకర్యం ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు. ఇవే కాకుండా హైదరాబాద్ - రక్సెల్, హైదరాబాద్ - గోరఖ్ మధ్య సైతం సమ్మర్ స్పెషల్ రైళ్లను నడుపనున్నామని, వాటి షెడ్యూల్ త్వరలో విడుదల చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

24 నుంచి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

▸▸ ఉమ్మడి పది జిల్లాల నుంచి పాల్గొననున్న 50 జట్లు ▸▸ తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24నుంచి 27వరకు హనుమకొండ జేఎన్ఎస్‌లోని హ్యాండ్ బాల్ కోర్టులో 6వ తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ తెలిపారు. శనివారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కార్యాలయంలో క్రీడా పోటీలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పవన్‌కుమార్ పాల్గొని ముందుగా క్రీడా పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉమ్మడి పది జిల్లాల నుంచి హ్యాండ్‌బాల్‌లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికి తీసి వారిని ప్రోత్సహించడానికి తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియే షన్ ఆధ్వర్యంలో 4రోజుల పాటు లీగ్ కమ్, నాకౌట్ పద్ధతిన పండుగ వాతావ రణంలో క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. అండర్-15బాలుర విభాగంలో నిర్వహించే ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 50 జట్లు పాల్గొంటాయని, ఇందులో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా మైదానం సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో బసతో పాటు ఉచిత భోజన వసతులను కల్పిస్తామన్నారు. రాష్ట్ర స్థాయి టాలెంట్ హంట్ చాంపియన్‌షిప్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబ ర్చిన 100 మంది క్రీడాకారులను ఎంపిక చేసి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలం గాణ (సాట్) సహకారంతో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యం లో హైదరాబాద్‌లో నెల పాటు ప్రత్యేక శిక్షణ అందిచడానికి కృషి చేస్తామ న్నారు. అత్యుత్తమ ప్రతిభతో రాణించిన క్రీడాకారులకు సాట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలు కల్పించడంతోపాటు ఖేలో ఇండి యా హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొనేలా అవకాశాలను కల్పించాలన్నారు. విజేతలుగా నిలిచిన జట్టుకు ట్రోఫీ, సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నగరబోయిన సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి ఇట్యాల శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

కావ్య గెలుపునకు సమష్టిగా కృషి చేద్దాం

▸▸ వరంగల్ లోక్‌సభ ఎన్నికపై మంత్రి శ్రీధర్‌బాబు దిశా, నిర్దేశం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 20 : వరంగల్ లోక్‌సభ స్థానాన్ని మూడు లక్షల ఓట్ల మెజారిటీతో కైవసం చేసుకోవాలని ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలకు మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. శనివారం రాత్రి హనుమకొండలోని ఓ హోటల్‌లో శ్రీధర్‌బాబు సమీక్ష జరిపారు. వరంగల్ లోక్‌సభ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు అభ్యర్థి కడియం కావ్య ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, టీపీసీసీ నాయకులు కూచన రవళి, ఈవీ శ్రీనివాస్, డాక్టరు అనిల్‌కుమార్, డాక్టరు రామక్రిష్ణ తదితరులతో సమీక్ష జరిగింది.

లోక్‌సభ ఎన్నికలో మెజారిటీ, గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గం వరకు ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల బాధ్యతల నిర్వహణ, మెజారిటీ, ప్రచారం, పార్టీ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్, 24న సీఎం రేవంత్‌రెడ్డి సభ, తదితర అంశాలను సుదీర్ఘంగా సమీక్షించారు. నిర్వహించాల్సిన అంశాలపై దిశా, నిర్దేశం చేశారు. పార్టీ గెలుపు ఖాయమని, అయితే మెజారిటీ అత్యంత ప్రాధాన్యత విషయమనేది గుర్తించాలని ఉద్బోధించారు. టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులతో చర్చించి నచ్చచెప్పాలని సూచించారు. 24 తరువాత ప్రచారాన్ని ఉధృతం చేయాలని, ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు బాధ్యతలు తీసుకోవాలన్నారు. పార్టీ మేనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. ఈనెల 24న మడికొండలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభ నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలను మంత్రి శ్రీధర్‌బాబు సమీక్షించారు. నియోజకవర్గాల వారిగా శ్రేణులతరలింపు, రవాణా ఇతర విషయాలను చర్చించారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పాల్గొన్న ఎమ్మెల్యేలు తదితర ముఖ్య నేతలు


















వ్యయ పరిశీలన రిజిస్టర్ నిర్వహించాలి

▸▸ ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్‌సింఘూ

▸▸ ఎన్నికల పరిశీలకులతో కమిషనర్ భేటీ



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 20: వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తప్పకుండా ఎన్నికల వ్యయపరిశీలన రిజిస్టర్లు తప్పకుండా నిర్వహించుకోవాలని ఎన్నికల పరిశీలకుడు ధీరజ్‌సింఘూ సూచించారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో 15- వరంగల్ ఎస్సీ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వరంగల్ తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్‌వో, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఎన్నికల అధికారులతో శనివారం భేటీ అయ్యారు. ధీరజ్‌సింగా కార్యాలయంలోని పలు ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా దీరజ్‌సింగా మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లతో పాటు ఎన్నికలకు సంబంధించిన ఖర్చులను రికార్డులను నమోదు చేయాలని సూచించారు. అభ్యర్థుల అమోద, అమోదయోగ్యం కానీ ప్రతీ ఖర్చును లెక్కించాలన్నారు. అభ్యర్థుల ప్రచారం, ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధించిన అన్ని క్లిప్స్ సర్వేలెన్స్ టీములు రికార్డు చేయాలన్నారు. అభ్యర్థుల పూర్తి వివరాలు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందించాలని చెప్పారు. ప్రచార ఖర్చులు నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేయాలని అన్నారు. పోటీచేసే అభ్యర్థులు అన్ని రకాల కర్చులు తప్పకుండా పక్కా లెక్క ఉండాలన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యయపరిశీలకులు మానస, అకౌంటింగ్ టీం సిబ్బంది ఖీరానాయక్, లింగస్వామిలతో పాటు పలు శాఖల సిబ్బంది ఉన్నారు.

ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలి

▸▸ వరంగల్ తూర్పు స్వీప్ నోడల్ అధికారి రాజేశ్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి రాజేశ్‌కుమార్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 20 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని వరంగల్ తూర్పు స్వీప్ నోడల్ అధికారి రాజేశ్ కుమార్ అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా శనివారం బల్దియా కార్యాలయం ఆవరణలోని మెప్మా కార్యాలయంలో ఓటు హక్కుపై లోక్‌సభ నియోజక వర్గం పరిధి -106 (వరంగల్ తూర్పు) స్వీప్ -2024 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏకశిల పట్టణ సమాఖ్య సభ్యులకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేశ్ కుమార్ హాజరై మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు అవగాహనపై ప్రజల్లో విస్తృత అవగాహన తీసుకురావాలని అన్నారు. అదే విధంగా ఈ నెల 25న ఉదయం 8 గంటలకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ రమేష్, సీవోలు నాగరాజు, సఫియా, ఆర్‌పీలు పాల్గొన్నారు.

వరంగల్‌లో మూడో రోజు నాలుగు నామినేషన్లు



వరంగల్ పార్లమెంట్ ఆర్‌వో ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంసీపీఐ(యూ) అభ్యర్థి సావిత్రి



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థి గాదెపాక అనిల్‌కుమార్



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మేకల సుమన్

వరంగల్ కలెక్టరేట్/మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతోంది. మూడో రోజైన శనివారం వరంగల్ పార్లమెంట్ స్థానానికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ఎంసీపీఐ(యూ) అభ్యర్థి మాస్ సావిత్రి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థి గాదెపాక అనిల్‌కుమార్ ఒకసెట్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మేకల సుమన్ ఒకసెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మరో స్వతంత్ర అభ్యర్థి బరిగెల శివ తొలిరోజున ఒక సెట్ వేయగా, శనివారం మరోసెట్ పత్రాలను అందజేశారు. ఇకమహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి మూడో రోజు శనివారం

మహబూబాబాద్‌లో నిల్

ఒక్క నామినేషన్ కూడా దాఖలవలేదు. ఈ నెల 18న తొలి రోజు ఒకరు, 19న రెండవ రోజు నలుగురు నామినేషన్లు వేశారు. కాగా, 22వ తేదీ సోమవారం బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్, 23న బీఆర్ఎస్ అభ్యర్థిగా మాలోతు కవిత నామినేషన్లు వేయనున్నారు.

సమాచారమంతా చరవాణిలోనే..

▸▸ సీ-విజిల్‌తో ఎన్నికల ఉల్లంఘనలకు అడ్డుకట్ట



వరంగల్ సిటీ, ఏప్రిల్ 20 : ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తోంది. గతంతో పోలిస్తే ఇప్పుడు డిజిటల్ అక్షరాస్యత పెరిగిపోయింది. ప్రతీ ఇంట్లో చరవాణి(మొబైల్), ప్రతీ మనిషికో చరవాణి మామూలైపోయింది. ఈ అంశాన్నే కేంద్ర ఎన్నికల సంఘం పరిగణలోకి తీసుకుంది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పక్కాగా ప్లాన్ చేసింది. ప్రతీ విషయం ఓటరు తెలుసుకునేలా యాప్‌లను రూపొందించింది. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఓటర్లు ఫిర్యాదు చేసేందుకు, ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు, అభ్యర్థుల వివరాలను తెలుసుకునేందుకు ఇలా ప్రతీ సమాచారం అందుబాటులో ఉంచుతోంది. బరిలో నిలిచే అభ్యర్థులు సైతం ఆన్‌లైన్ ద్వారానే సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతులు తీసుకునేలా అవకాశం కల్పించింది. భారత ఎన్నికల సంఘం రూపొందించిన యాప్‌లను స్మార్ట్ ఫోన్‌లలో ప్లే స్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సీ-విజిల్‌తో..



అలాగే కోడ్ ఉల్లంఘన, వ్యయ ఉల్లంఘన జరిగితే వెంటనే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడానికి సీ-విజిల్ యాప్‌ను ఉపయోగించండి. నగదు, మద్యం, మాదక ద్రవ్యాల పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టు వస్తువుల పంపిణీ, ప్రజల ఆస్తులను పాడుచేయడం, కుల, మత ద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు జరిగితే ఫిర్యాదు చేయవచ్చు. అలాగే అసత్య వార్తల ప్రసారం, ఓటర్లను బెదిరించడం, చెల్లింపు వార్తలు, మారణాయుధాలు కలిగియుండుట, ఓటర్ల రవాణా ఇలాంటివన్నీ ఎన్నికల నియమావళి ఉల్లంఘనల కిందకే వస్తాయి. వీటిపై సీ-విజిల్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. మీరు చేసిన ఫిర్యాదుకు వెంటనే ఎన్నికల అధికారులు స్పందిస్తారు. ఐదు నిమిషాల వ్యవధిలో జిల్లా ఎన్నికల అధికారి వెరిఫికేషన్ కోసం ఫీల్డ్ యూనిట్‌కు ఫిర్యాదును కేటాయిస్తారు. 15 నిమిషాలలో ఫీల్డ్ టీమ్, ఫిర్యాదు చేసిన స్థలానికి చేరుకుంటుంది. 30 నిమిషాలలో ఫీల్డ్ టీం చర్య అమలు చేసి నివేదిక పంపిస్తారు. 50 నిమిషాలలో రిటర్నింగ్ అధికారి ఫిర్యాదుపై చర్యలు చేపడుతారు.

అదుపు తప్పి ఫ్లైయాష్ లోడ్ లారీ బోల్తా

▸▸ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

మడికొండ, ఏప్రిల్ 20 : ఔటర్ రింగ్‌రోడ్డుపై ఫ్లైయాష్ లోడ్ లారీ అదుపు తప్పి బోల్తా పడడంతో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మడికొండ ఏఎస్సై చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున భూపాలపల్లి నుంచి సూర్యాపేటకు ఫ్లైయాష్ లోడ్‌తో వెళ్తున్న లారీ కాజీపేట మండలం టేకులగూడెం క్రాస్ వద్ద ఔటర్ రింగ్ రోడ్ పై అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ గుగులోత్ నితిన్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. 100 డయల్ సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి వారి సహాయంతో డ్రైవర్‌ను క్యాబిన్‌లో నుంచి బయటకు తీసి ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా, లారీ డ్రైవర్, ఓనర్‌లు సూర్యాపేటకు చెందిన వారని ఏఎస్సై తెలిపారు.



నామినేషన్ కౌంటర్

మూడో రోజు (20-4-2024)	దాఖలైన మొత్తం నామినేషన్లు: వరంగల్	మహ-బాద్
	11	6

వరంగల్ (ఎస్సీ)	: మాస్ సావిత్రి (ఎంసీపీఐ), మేకల సుమన్ (ధర్మ సమాజ్ పార్టీ), గాదెపాక అనిల్‌కుమార్ (స్వతంత్ర), బరిగెల శివ (స్వతంత్ర)
మహబూబాబాద్(ఎస్టీ)	: లేవు.



వీవీ ప్యాట్, ఈవీఎంల తేడా



వరంగల్ కలెక్టరేట్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఈవీఎం), ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీ ప్యాట్). అభ్యర్థి పేరు, గుర్తు, సీరియల్ నెంబరు అన్ని కనిపిస్తాయి. ఇలా 7 సెకన్లు మాత్రమే ఉంటుంది. ఈవీఎంలలో కంట్రోల్ యూనిట్, బ్యాలెటింగ్ యూనిట్‌లు ఉంటాయి. కంట్రోల్ యూనిట్ పోలింగ్ ఆఫీసర్ దగ్గర, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ ఓటు వేసే ఓటరు దగ్గర ఉంటాయి. పోలింగ్ ఆఫీసర్ యాక్టివేట్ చేస్తేనే ఓటు వేసే అవకాశం ఉంటుంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్ష



వరంగల్ కలెక్టరేట్ : ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం ఎన్నికల నిబంధనలు ఎవరైనా ఉల్లంఘించినట్లయితే రెండు సంవత్సరాల పాటు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. అభ్యర్థులు బాధ్యతాయుతంగా ఖాతాల వివరాలను ఎన్నికల అధికారులకు తెలియపర్చాలి. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు, పెయిడ్ న్యూస్, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులను ఉల్లంఘనగా పరిగణిస్తారు.

వెబ్‌సైట్‌లో సమగ్ర సమాచారం



వరంగల్ కలెక్టరేట్ : ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉండేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించింది.

ceotelangana.nic.in వెబ్‌సైట్‌లో ఓటరు నమోదుతో పాటు ఓటరు జాబితాలో పేరు, తొలగింపు, సవరణలు చేసుకోవచ్చు. అలాగే పోలింగ్ కేంద్రం వివరాలతో పాటు పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా గతంలో పోటీ చేసిన అభ్యర్థుల వివరాలు కూడా వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

కష్టకాలంలో తోడున్న వారే నిజమైన కార్యకర్తలు

▸▸ ద్రోహులకు బీఆర్ఎస్ కార్యకర్తలు గుణపాఠం చెప్పాలి

▸▸ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

▸▸ పరకాలలో బీఆర్ఎస్ లోక్‌సభ స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బండా ప్రకాశ్

పరకాల, ఏప్రిల్ 20: కష్టకాలంలో తోడున్న వారే పార్టీకి నిజమైన కార్యకర్తలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని లలితా కన్వెన్షన్ హాలులో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతన శనివారం బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. అధికార దాహం కోసం పార్టీ మారే నాయకులు, కార్యకర్తలు పార్టీకి అవసరం లేదని, ఎందరు వెళ్లినా వరంగల్ ఎంపీ స్థానం బీఆర్ఎస్ అధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో అబద్ధాల హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజు వచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15న రైతులకు రుణమాఫీ చేస్తామని ఇప్పటి కూడా కల్లబొల్లి మాటలు చెబుతున్నాడని అన్నారు. బ్రోకర్లే పార్టీలు మారుతున్నారు తప్పా.. నిజమైన కార్యకర్తలు పార్టీలోనే ఉన్నారని తెలిపారు. కడియం శ్రీహరిని తన తండ్రి చదివించాడని, అలాంటి వాడు తనను వ్యతిరేకించి మాట్లాడటం సరైంది కాదన్నారు. ఎన్నో కష్టాలకు ఓర్చి కాళేశ్వరం ప్రాజెక్టు కడితే రైతులు ఎంతో మంది మూడు పంటలు పండిస్తున్నారని, ఒకటి రెండు పిల్లర్లు కుంగితే కాంగ్రెస్ వాళ్లు వేలెత్తి చూపడం సరికాదన్నారు.

బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ అండతో ఎదిగిన కడియం శ్రీహరి, అరూరి రమేశ్ ద్రోహులుగా నిలిచారని, ఎన్నికల్లో వారికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు మోసానికి, న్యాయానికి మధ్య జరిగే పోరు అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఎన్నో అబద్దాలు చెబుతూ ఎన్నో పదవులు పొంది, ఎంతో సంపాదించుకున్న కడియం శ్రీహరి మోసకారి అన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవిని రాజీనామా చేసి మళ్లీపోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. ప్రతీ ఒక్క కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి కడియం శ్రీహరి చేసిన ద్రోహం వివరించాలని పిలుపునిచ్చారు.

కడియం శ్రీహరి నకిలీ దళితుడు

కడియం శ్రీహరి నకిలీ దళితుడు అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. దళితద్రోహి, అవినీతి చక్రవర్తి, చరిత్రహీనుడు, దళిత హక్కులను దోచుకునేవ్యక్తి కడియం శ్రీహరి అని ధ్వజమెత్తారు. తాను మాదిగ కులానికి చెందినవాడినని, కడియం శ్రీహరికి దమ్ముంటే ఆయన కులం ఏమిటో చెప్పాలని నిలదీశారు. బైండ్ల కులంలో చేరి దళిత హక్కులను దోచుకుతింటున్నాడని ఆరోపించారు. కన్నతల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీకి, దేవుడు లాంటి కేసీఆర్‌ను మోసం చేసి నకిలీ కులం పేరుతో బిడ్డను రాజకీయాల్లో దింపి గెలిపించుకునే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, తానూ పోటీ చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, లింగంపెల్లి కిషన్‌రావు, శోభన్‌బాబు, వాసుదేవరెడ్డి, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ ఉంటేనే దేశానికి భద్రత

▸▸ పథకాల పేరుతో కాంగ్రెస్ మోసం

▸▸ వరంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

▸▸ బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్



శాయంపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న అరూరి రమేష్

శాయంపేట, ఏప్రిల్ 20 : నరేంద్ర మోదీ ప్రధానిగా ఉంటేనే భారత దేశానికి రక్షణ ఉంటుందని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తిరెడ్డితో పాటు మండల కేంద్రంలో అరూరి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. పదేళ్లుగా దేశంలో ఎలాంటి అవినీతి, కుంభకోణాలు లేకుండా బీజేపీ సుపరిపాలన కొనసాగిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించకపోయినా కేంద్రం పెద్దన్న పాత్ర పోషిస్తూ రాష్ట్రాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని కొనియాడారు. ఆర్టికల్ 370 రద్దులాంటి చారిత్రాత్మకమైన నిర్ణయాలు జరిగాయని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం అక్కడి ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు సొంతంగా అనేక సేవా కార్యక్రమాలు చేశామని అన్నారు. వరంగల్ ఎంపీగా గెలిపిస్తే దేశంలోనే వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మామునూరు ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ, భూపాలపల్లి రైల్వేలైన్ నిర్మాణం, టెక్స్‌టైల్ పార్క్ విస్తరణ లాంటి అనేక లక్ష్యాలు పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ గెలిచిందని అరూరి ఆరోపించారు. ఇప్పటివరకు హామీలు అమలు చేయలేదని అన్నారు. లోక్‌సభ ఎన్నికలలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చిత్తుగా ఓడించి. మోదీని ప్రధాని చేయడానికి బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నాగపురి రాజమౌళి, మార్తినేని ధర్మారావు, చందుపట్ల సత్యపాల్‌రెడ్డి, వన్నాల శ్రీనివాసులు జిల్లా నాయకులు రాయరాకుల మొగిలి, నరహరిశెట్టి రామక్రిష్ణ, వనం దేవరాజు, నాగరాజు, కోమటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బాలరాజు (ఫైల్)

ఐనవోలు, ఏప్రిల్ 20 : కుటుంబంలో కుమారుడు, తల్లి వరుసగా మృతిచెందడంతోపాటు తండ్రి, కూతురు అనారోగ్యానికి గురికావడంతో మనస్తాపానికి గురైన ఓవ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెంకటాపురంలో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన కొసుకొండ బాలరాజు (32) శుక్రవారం పురుగుల మందు తాగగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. బాలరాజు కుమారుడు సాయి మూడేళ్ల వయస్సులో కిందటేడు అనారోగ్యంతో మృతిచెందగా, తల్లి సోమమ్మ రెండు మాసాల కిందట మృతి చెందింది. కూతురు వైష్ణవి మానసిక వికలాంగురాలు, తండ్రి మల్లయ్య పది రోజుల కిందట పక్షవాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులిద్దరు మృతిచెందడం.. ఇద్దరు అనారోగ్యానికి గురికావడంతో మనోవేదనకు గురైన బాలరాజు.. జీవితంపై విరక్తి చెంది ఐనవోలు శివారులోని జామాయిల్ తోటలో పురుగుల మందు తాగాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఉంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థాయి యూత్ మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 26నుంచి 28వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యూత్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 1జనవరి 2006 నుంచి 31 డిసెంబరు 2007 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, మెడికల్ సర్టిఫికెట్‌లను వెంట తీసుకొని ఈ నెల 21న హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్‌హాల్‌లో ఉదయం 7గంటలకు రిపోర్టు చేయాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 9959711609 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సమ్మర్ క్యాంపును వినియోగించుకోవాలి

● మానుకోట క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్20 : జిల్లా కేంద్రంలో ప్రారంభమైన క్రికెట్ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, మానుకోట క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నేతృత్వంలో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలరోజుల పాటు కొనసాగనున్న శిక్షణ శిబిరానికి 150 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. విజయ్‌సారథి, మెతుకు కుమార్, తోట వినయ్, రావు లనవీన్‌రెడ్డి, శ్రీనివాస్, పెరుగు కుమార్, నీలం వెంకటేశ్వర్లు, అంజీ, పిట్టల శ్రావణ్, ముజాహిద్, అనిర్వేశ్, ధర్మచరణ్‌రెడ్డి, బాబి, వెంకన్న, రమణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

పీహెచ్‌సీని పరిశీలించిన డీఎంఅండ్‌హెచ్‌వో

నెల్లికుదురు, ఏప్రిల్ 20 : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో కళావతి బాయి శనివారం పరిశీలించారు. పీహెచ్‌సీలో ఈనెల 19 రాత్రి విద్యుదాఘాతంతో మంటలలో మందులు, కంప్యూటర్ దహనం కావడంతో పరిశీలించారు. రూ.2లక్షలు నష్టం జరిగిందని వైద్యసిబ్బంది తెలిపారు. వేసవిలో విద్యుత్ వైర్లు షార్ట్‌సర్క్యూట్ కాకుండా మరమ్మతులు చేపట్టాలని వైద్యసిబ్బందికి ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వంశీకృష్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణను దోచుకున్న కేసీఆర్ కుటుంబం

● పరకాల ఎమ్మెల్యే, వరంగల్ పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రేవూరి

తొర్రూరు, ఏప్రిల్ 20 : తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల పాటు కేసీఆర్ కుటుంబం సెంటిమెంట్ పేరుతో దోచుకుని తిని ప్రజలను మభ్య పెట్టారని పరకాల ఎమ్మెల్యే, వరంగల్ పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. శనివారం తొర్రూరులోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో మూడునెలల్లో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, గిట్టుబాటు ధర, వ్యవసాయానికి చట్టబద్ధత కల్పిస్తుందన్నారు. ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, నాయకులు కాకిరాల హరిప్రసాద్, కె.నిరంజన్ రెడ్డి, రాపాక సత్యనారాయణ, హమ్యానాయక్, సోమ రాజశేఖర్, సుంచు సంతోష్, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరికలు

నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆధ్వర్యంలో రాయపర్తి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు 150 మంది శనివారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యానాయక్, రవీందర్ రెడ్డి, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధికి బీజేపీ కృషి

● మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 20 : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కృషి చేస్తుందని మానుకోట బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం పార్లమెంట్ స్థాయి ఎస్సీ మోర్చా సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ భారతదేశం సురక్షితంగా ఉండాలంటే మోడీని మూడోసారి ప్రధానమంత్రిని చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీలను ఎక్కడ అమలుకావడంలేదని ఆరోపించారు. ఈ నెల 19న మానుకోటలో జరిగిన కాంగ్రెస్ జనజాతర సభకు జనంలేక సీఎం రేవంత్‌రెడ్డి బస్సులోనే 1.45 గంటలకు వేచి ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలలకే ప్రజలు, రైతులు దూరమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో 4కోట్ల జనాభాలో 15శాతం ఎస్సీ జనాభా ఉందన్నారు. వారందరినీ ఐక్యం చేసేందుకే 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎస్సీ మోర్చా సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ. 90వేల కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, ఎమ్మార్పీఎస్ మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ గుగ్గిళ్ల పీరయ్య, ధర్మారపు వెంకన్న, వద్దిరాజు రాంచందర్‌రావు, మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, మోసంగి మురళీ, ముసుగు శ్రీనివాస్‌రెడ్డి, వెన్నమల్ల అజయ్, ఫైండ్ల శ్రీనివాస్, వంగూరి రమేష్, సురేందర్, రాంబాబు, కొంపెల్లి అనిల్, బోడ వెంకన్న, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అజ్మీరా సీతారాంనాయక్

పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 20 : మండలంలోని మాటేడు గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని, స్టాంప్‌ను ఓ వ్యక్తి ఫోర్జరీకి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాటేడు గ్రామానికి చెందిన మహంకాళి ప్రశాంత్ తండ్రి వెంకటయ్య అనేవ్యక్తి గ్రామ పంచాయతీ కార్యదర్శికి సంబంధం లేకుండానే సంతకం ఫోర్జరీ చేసి, నకిలీ జీపీ స్టాంప్‌ను తయారు చేసి యాజమాన్య ధ్రువీకరణ పత్రం పొందినట్లు తెలిపారు. ఫోర్జరీ సంతకం ద్వారా పొందిన యాజమాన్య ధ్రువీకరణ పత్రాన్ని ఏమైన రిజిస్ట్రేషన్ కోసం ఉపయోగించాడా...? ఫైనాన్స్ కంపెనీ నుంచి రుణం తీసుకోవడం కోసం ఉపయోగించాడో తెలియాల్సి ఉంది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి నగేష్‌ను వివరణ కోరగా తన ప్రమేయం లేకుండా ఫోర్జరీ సంతకం, నకిలీ స్టాంప్‌ను తయారు చేసిన వ్యక్తిపై ఉన్నతాధికారులకు సమాచారం అందజేసి, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎంపీవో గౌస్‌ను వివరణ కోరగా కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసిన విషయం తమ దృష్టికి వచ్చింది. జీపీ నుంచి యాజమాన్య ధ్రువీకరణ పత్రం జారీచేసే అధికారం లేదు. సంతకం ఫోర్జరీ, నకిలీ స్టాంప్ తయారు చేసిన వ్యక్తిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఇక్కడే జరిగాయా, ఇతర గ్రామాల్లో కూడా ఏమైన అవకతవకలు జరిగాయా అని విచారించుకుంటాం.

కోడ్ కూసినా కానరాని నిబంధనలు!?

● గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు
● అర్ధరాత్రి వరకు కొనసాగుతున్న దుకాణాలు
● చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు

పెద్దవంగర, ఏప్రిల్ 20 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ కూసింది. కానీ, పెద్దవంగర మండలంలో మాత్రం కోడ్ నిబంధనలు అమలు కావడం లేదు. గ్రామాల్లో విచ్చలవిడిగా వెలిసిన బెల్ట్‌షాపులు అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. యథేచ్ఛగా షాపులు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం దుకాణాదారులు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వాహకులను ప్రోత్సహిస్తూ మద్యం సరఫరా చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

60కి పైగా బెల్టు షాపులు..

పెద్దవంగర మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయాగ్రామాల పంచాయతీల పరిధిలోని బెల్ట్‌షాపులు ఒక్కొక్క గ్రామంలో 4, 5 వరకు బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. కొన్నిగ్రామాల్లో అర్ధరాత్రి వరకు



మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, మందుబాబులు మద్యం తాగి గ్రామాల్లో రెచ్చిపోతున్నారని, బెల్టుషాపుల వల్ల పేద కుటుంబాలు రోడ్డుమీద పడుతున్నాయని, మద్యానికి బానిసై గ్రామాల్లో గొడవలకు దారి తీస్తున్నాయని గ్రామస్థులు ఆరోపించారు.

అమలు కాని నియమాలు..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్చి 16 నుంచి కోడ్ అమలులోకి వచ్చింది. అనుమతి, ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని, గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించవద్దని, మద్యం అమ్మకాలు చేయవద్దని, ఈ నిబంధనలు తమకేపట్టనట్లు కొందరు గ్రామాల్లో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఎన్నికల్లో నిబంధనలు పకడ్బందీగా అమలు చేసినా ప్రస్తుతం అమ్మకాలు ఇంకా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడంలో అధికారులు దృష్టి సారించడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు జరగకుండా చర్య తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బెల్టుషాపులపై చర్యలు తీసుకుంటాం..

ప్రవీణ్, ఎక్సైజ్ సీఐఆర్, తొర్రూరు

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున తొర్రూరు ఎక్సైజ్ పరిధిలో బెల్టుషాపులు లేకుండా చూస్తున్నాం. గ్రామాల్లో ఇప్పటి వరకు తనిఖీలు నిర్వహించి కొంత మేరకు బెల్టుషాపులు అరికట్టాం. గ్రామాల్లో, తండాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుంటాం.

కాంగ్రెస్ నేత రమేష్‌పై సస్పెన్షన్ వేటు ఎత్తివేత

గూడూరు, ఏప్రిల్ 20 : మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్‌పై సస్పెన్షన్ వేటు ఎత్తివేసినట్లు, మరోపక్క సస్పెన్షన్ వేటును కొనసాగిస్తున్నట్లు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి పేరిట ఉత్తర్వుల కాపీలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మానుకోట సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా అప్పటి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూనావత్ రమేష్ పోటీ చేశారు. ఈ క్రమంలో ఆయనపై టీపీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చిన్నారెడ్డి ఆరు సంవత్సరాల పాటు సస్పెన్షన్ వేటు వేశారు. అయితే ఈనెల 9న రమేష్‌పై సస్పెన్షన్ ఎత్తివేస్తూ చిన్నారెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆ కాపీ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాజాగా ఈనెల 20న రమేష్‌పై సస్పెన్షన్ ఎత్తివేయలేదని చిన్నారెడ్డి పేరిట మరో ఉత్తర్వు కాపీ సైతం సోషల్ మీడియాలో పెట్టడంతో రమేష్‌పై సస్పెన్షన్ ఎత్తివేత అంశం గూడూరు మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 20 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబు74వ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.మహబూబాబాద్‌లోని టీడీపీ పార్టీ కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన కేక్‌నుఆ పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడు కొండపల్లి రాం చందర్‌రావు కట్‌చేసి పంపిణీ చేశారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిట్టల రాము, ప్రేమ్‌చంద్‌వ్యాస్, కొండపల్లి రాంచంద్రమ్మ, హరికిషన్, కోటేశ్వర్‌రావు, ఎల్లయ్య, రాజేష్, బాలు, కట్ల వెంకన్న, ఇమ్రాన్, మల్సూర్, బుల్లి పాల్గొన్నారు.


టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నేతలు

'బీఆర్‌ఎస్ కార్యకర్తలను కాపాడుకుంటా'

కురవి, ఏప్రిల్ 20 : బీఆర్‌ఎస్ పార్టీతో ప్రయోజనం పొందిన కొంతమంది స్వార్థ నాయకులు పార్టీని వీడుతున్నారని, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. కురవిలో శనివారం ముఖ్యకార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కార్యకర్తలంతా పార్టీలోనే కొనసాగాలన్నారు. కార్యకర్తలను, నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సమిష్టిగా పోరాడుదామన్నారు. భవిష్యత్ బీఆర్‌ఎస్‌దేనని, కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో ఐలు నరహరి, గుగులోతు నెహ్రూ, బాదే నాగయ్య రవి పాల్గొన్నారు.

'స్వలాభం కోసం ఆచారాలను విస్మరించొద్దు'

మరిపెడ, ఏప్రిల్ 20 : వ్యక్తి స్వలాభం కోసం పూర్వపు కాలం నుంచి వస్తున్న ఆచారాలను విస్మరించొద్దని మండలంలోని గాలివారిగూడెంకు చెందిన గ్రామస్థులు నారెడ్డి చంద్రకాంత్ రెడ్డి, చలమల్ల నర్సింహారెడ్డి, రాంబాబు, సుదర్శన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి అన్నారు. శనివారం వారు గాలివారి గూడెం ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామానికి సంబంధించిన గ్రామ దేవత ముత్యాలమ్మతల్లికి బోనాలు సమర్పించే ఆనావాయితి ఉందన్నారు. తల్లి విగ్రహ ప్రతిష్ఠను శ్రావణమాసం జరుపుకుందామని గ్రామస్థులు కోరుకొంటుతుండగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇప్పుడు ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠచేస్తానని పట్టుపట్టడంపై వారు విమర్శలు చేశారు. గ్రామస్థులంతా కలిసి మరోగుడి నిర్మించుకొని శ్రావణ మాసంలోనే ముత్యాలమ్మ తల్లిని కొలుసుకుందామని ఈ సందర్భంగా తీర్మానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో శేఖర్‌రెడ్డి, ఆలుదాసు వెంకన్న, పొన్నం యాకయ్య, ఉపేందర్, దామోదర్‌రెడ్డి, యల్లయ్యగౌడ్, చల్లమల్ల వెంకన్న, ఎడెల్లి వెంకన్న, రాజుల లింగయ్య, గడ్డం రమేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నారెడ్డి చంద్రకాంత్‌రెడ్డి

గుడుంబాస్థావరాలపై దాడులు

● ఎనిమిది మందిపై కేసు నమోదు

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 20 : ప్రభుత్వ నిషేధిత సారాయి, బెల్లం పానకం స్థావరాలపై ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించి ఎనిమిదిమందిపై కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కురవికి చెందిన బాదావత్ రాధ, మహబూబాబాద్ మండలం మల్యాలకు చెందిన వసంత, కురవికి చెందిన గంగరబోయిన లక్ష్మి, బుడమ వీరమ్మ, పెద్దతండాకు చెందిన గుగులోతు నందు, గుగులోతు అచ్చమ్మ, మహబూబాబాద్ శివారు అనంతారంకు చెందిన జంగ వెంకటమ్మ, ఎడ్ల ఎల్లబాయిలు గత కొంతకాలంగా ప్రభుత్వ నిషేధిత సారాయిని తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం స్టేట్ టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ సంయుక్త ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలహాసన్ రెడ్డి, వరంగల్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారిబాదావత్ కిరణ్‌నాయక్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈదాడుల్లో ఎనిమిది మంది పట్టుబడినట్లు పేర్కొన్నారు. సదరు ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్టీఎఫ్ సీఐ దీక్షారెడ్డి, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.


బెల్లంపానకం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కురవి, ఏప్రిల్ 20 : నల్లెల్ల సూర్యతండాలోఆంజనేయస్వామి దేవస్థాన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ ప్రారంభమైంది. నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేద పండితులు శనివారం ప్రారంభించారు. అనేక రకాల పూజా కార్యక్రమాల నడుమ తండ పంచాయతీలో భక్తివాతావరణం నెలకొంది. ఆది, సోమవారాలు సైతం పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ హాజరయ్యారు. ఆయనవెంట కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, కాంగ్రెస్ నాయకులు తేజావత్ గాంధీ, శ్రీను, అజ్మీర నరేందర్ పాల్గొన్నారు.


ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ప్రభుత్వవిప్ రాంచంద్రునాయక్


నేడు మిద్దెతోటల ఏర్పాటుపై అవగాహన సదస్సు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 20 : రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్షకసేవా కేంద్రం నిర్వహణలో హైదరాబాద్‌లోని రైతునేస్తం కార్యాలయంలో ఆదివారం మిద్దెతోటల నిర్వహణ టెర్రస్ గార్డెనింగ్, బాల్కని గార్డెనింగ్, కిచెన్ గార్డెనింగ్‌లలో సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ పురస్కార గ్రహీత ఎడ్లపల్లి వెంకటేశ్వర రావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ కార్యక్రమంలో మిద్దెతోట నిపుణులు పాల్గొని మెళకువలు, చీడపీడల నివారణ కార్యక్రమాలు, జాగ్రత్తలు, కొత్తగా ఇంటి పంటను ప్రారంభించాలనుకునే వారికి సూచనలు తెలియజేస్తారు. ఇంటి ఆవరణలో నాలుగు మొక్కలు పెంచడం వల్ల ఆక్సిజన్ లభిస్తుందని, ఇంటికి అవసరమైన కూరగాయాలు, పండ్లు, పూలు దొరుకుతాయని చెప్పారు. యాంత్రీక జీవితానికి కొత్త వెసులుబాటు లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు 70939 73999, 95538 25532కు ఫోన్‌చేసి తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి

● ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ పీవీ ప్రసాద్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 20 : రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) జిల్లా చైర్మన్ పీవీ ప్రసాద్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్, ఐఆర్‌సీఎస్, లయన్స్‌క్లబ్, జిల్లా ప్రభుత్వ బ్లడ్‌బ్యాంకుల ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాద సమయంలో గాయపడి ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికిరక్తం ఎంతో అవసరముంటుందని, రక్తదానం వారికి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. గర్రెపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ హితేష్‌కుమార్, మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, ప్రతాపని లక్ష్మీనారాయణ, ఎ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రసాద్


మోదీతోనే భారతదేశం అభివృద్ధి

తొర్రూరు, ఏప్రిల్ 20 : ప్రధాని నరేంద్రమోదీ తోనే భారతదేశ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి లేగ రాంమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం తొర్రూరులో రూరల్ అధ్యక్షుడు బి.సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మండలంలోని హచ్చుతండా, చింతలపల్లి తదితర గ్రామాల నుంచి వందమంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్, పల్లె కుమార్, రచ్చ కుమార్, పులేందర్, రాంబాబు, రాజేష్, విష్ణు, భాస్కర్, రాజ్‌కుమార్, నవీన్, కిరణ్, పవన్ పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో సుధీర్‌కుమార్‌ను గెలిపించాలి

● మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, ఏప్రిల్ 20 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను ఎంపీ ఎన్నికల్లో బొందపెట్టాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపు నిచ్చారు. శనివారం మండలకేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో అందరూ ఐక్యంగా నిలిచి ముందుకువెళ్లాలని, సమన్వయంతో పని చేస్తూ సుధీర్‌కుమార్ విజయం కోసం కృషి చేయాలన్నారు. మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం శ్రీరాం మధుసూదన్‌రావు బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే ఉప్పరగూడెం గ్రామానికి చెందిన దుంపల వేణు కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మెట్టు శ్రీనివాస్, మాజీ జీసీసీ చైర్మన్ గాంధీనాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, శ్రీరాం సంజయ్, శ్రీరాంసుధీర్, సమ్మయ్య, శ్రీరాం రాము, హరీష్, రవి, లింగమూర్తి, గంగాధర్, వెంకట్రామయ్య, ముజీవుద్దీన్, షర్ఫోద్దీన్, రఘు, వెంకన్న, మహేష్, రాజేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

'అంగన్‌వాడీ స్కూళ్లపై నమ్మకం ఏర్పడేలా పని చేయాలి'

మరిపెడ, ఏప్రిల్20 : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు అంగన్‌వాడీ స్కూళ్లపై ప్రజలకు నమ్మకం ఏర్పడేలా పనిచేయాలని మరిపెడ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం మరిపెడబంగ్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు ఈసీసీఈ (ప్రీ గ్రాడ్యుయేషన్) ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సూపర్ వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు సమయ పాలన పాటించాలని సూచించారు. శ్రీమతి, రజినీ, ఉమ, విజయలక్ష్మి, శారద, అలీమా పాల్గొన్నారు.

'మోదీపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు'

గూడూరు, ఏప్రిల్ 20 : జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ జన జాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్రమోదీపై చేసిన వ్యాఖ్యలు సరికాదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్, మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్ అన్నారు. గూడూరు బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు శ్రీశైలం, బత్తుల లక్ష్మణ్, పడాల నాగరాజు, గడిల నాగరాజు, దోసపాటి శ్రీనివాస్, వెంకన్న, వాంకుడోతు రమేష్, బల్సికూరి సంపత్, కోరెఅనిల్, చంద్రశేఖర్, సాయికుమార్, సందీప్, సంతోష్, శ్రావణ్, మెరుగు మల్లయ్య, సాయిబాబా, ఐలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్

ప్రాంతీయ పార్టీల ద్వారా కుటుంబ పాలన

ప్రాంతీయ పార్టీల ద్వారా కుటుంబపాలన జరుగుతోందని బీజేపీ రాష్ట్ర నాయకులు లింగాల సుధీర్‌రెడ్డి అన్నారు. మదనాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ పార్టీల ద్వారా పరిపాలన పారదర్శకంగా జరుగుతుందన్నారు. అధికారం పోయి నాలుగు నెలలు గడవకముందే కేసీఆర్, కేటీఆర్, బీఆర్‌ఎస్ శ్రేణులు రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని బదనం చేయడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో రాజారావు, రామారావు పాల్గొన్నారు.

దళితుడిని అయినందుకే అవమానం

● బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి

గూడూరు, ఏప్రిల్ 20 : తాను దళితుణ్ని అయినందుకే అవమానం జరిగిందని గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి స్వామి అన్నారు. గూడూరులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జన జాతర సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరైనట్లు చెప్పారు. తాను దళితుడనైనందుకే తనను వేదికపైకి పిలువలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎక్కేందుకు ప్రయత్నించిన పోలీసులు అడ్డుకోవడం బాధ అనిపించిందని చెప్పారు. గత 10 సంవత్సరాలుగా పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ పటిష్ఠత కోసం తాను కార్యకర్తలతో కలిసి పనిచేశానన్నారు. గూడూరులో ఉన్న కొంతమంది నాయకులు తనను వేదికపైకి పిలువకుండా అవమానించారని చెప్పారు. ఈ సమావేశంలో కన్నెబోయిన వెంకన్న, యాకాంబ్రం, శివ, ఖదీర్ పాల్గొన్నారు.

హైస్కూల్ గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

కేసముద్రం, ఏప్రిల్ 20 : మండలం కల్వల జడ్పీహైస్కూల్‌లోని గ్రంథాలయానికి ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ, నేషనల్ ఫస్ట్ హ్యూమన్ చైన్ (ఎన్‌ఎఫ్‌హెచ్‌సీ) ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రూ.3వేల విలువైన పుస్తకాలను ఆ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన సురేష్ బిజ్జం సహకారంతో మొదటివిడతగా ఈ పుస్తకాలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బండారు నరేందర్, ఉపాధ్యాయులు చీకటి వెంకట్రానర్సయ్య, రాజేంద్రాచారి, బాలశౌరిరెడ్డి, లక్ష్మీనారాయణ, నాగేందర్, భిక్షపతి పాల్గొన్నారు.

కేజీబీవీలో..

మండలంలోని మహమూద్‌పట్నం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఎన్‌ఎఫ్‌హెచ్‌సీ ఆధ్వర్యంలో పాలిటెక్నికల్ పుస్తకాలను పంపిణీ చేసి కేరీర్ గైడెన్స్, ఐఐటీ, జేఈఈలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అరుణ, ఫౌండేషన్ సభ్యుడు ఇస్లావత్ సుమన్, సిబ్బంది దుర్గ, లక్ష్మి, అర్చన, రాధిక, సుష్మ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20 : విద్యార్థులు లక్షసాధన కోసం నిరంతరం కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మహబూబాబాద్‌లోని శ్రీచైతన్య టెక్నోస్కూల్ బ్రాంచ్-2లో ఇండియన్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ (ఐన్‌టీఎస్‌వో) పరీక్షలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు శుక్రవారం రాత్రి బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి చేతుల మీదుగా ద్వితీయ బహుమతి పొందిన కె.అభిరామ్, నాలుగో బహుమతి సాధించిన బి.హర్షిత్, ఐదో బహుమతి సాధించిన బి.సిద్ధికబాయ్‌లకు గోల్డ్‌మెడల్స్ సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాల్లో నిలిచి సమాజానికి మార్గదర్శకంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, శ్రీవిద్య, డీజీఎం చేతన్‌మాథుర్, ప్రిన్సిపాల్ జి.భార్గవిరెడ్డి, పాఠశాల డీన్ కె.రమేష్, ప్రిన్సిపాల్స్ డి.మధు, జి.భార్గవిరెడ్డి, టీఎల్ఎన్‌శర్మ పాల్గొన్నారు.


సిద్ధికబాయ్‌కు బహుమతిని అందజేస్తున్న తుమ్మల నాగేశ్వర్‌రావు



మేడే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నేతలు

మేడేను ఘనంగా నిర్వహించుకోవాలి

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 20 : కార్మికులంతా మేడే దినోత్సవాన్ని పండుగలా ఘనంగా నిర్వహించుకోవాలని ఏఐటీయూసీ జిల్లాప్రధానకార్యదర్శి రేషపల్లి నవీన్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ వీరభవన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం మేడే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామ్య పాలన అంతమై, పెట్టుబడిదారి విధానం కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మే1న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే కార్మికుల పండుగ మేడేను వాడవాడలా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు నర్రాశ్రావణ్, వీరవెల్లి రవి, మంద శంకర్, వెలుగు శ్రావణ్, దిలీప్ పాల్గొన్నారు.

పెట్రోల్ మంటల్లో కాలిన దంపతులు

● చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి కు తరలింపు
● భర్త మొదటి భార్య కేసు విషయంలో గొడవ

సంగెం (వరంగల్ జిల్లా), ఏప్రిల్ 20 : భార్యాభర్తల మధ్య తలెత్తిన మనస్పర్థలతో ఆ దంపతులు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. గ్రేటర్ వరంగల్ 43వ డివిజ న్‌లోని సత్యసాయినగర్ కాలనీలో మజార్ (30), అ జీమీ ఫాతిమా (26) దంపతులు అద్దె ఇంట్లో ఉంటున్నారు. మజార్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మజార్ తనమొదటి భార్యతో గొడవలు జరిగ్గా, ఆ కేసు కోర్టులో ఉంది. ఈ కేసు నడుస్తుండగా ఫిబ్రవరిలో వరం గల్‌లోని చార్‌బౌళికి చెందిన అజిమా ఫాతిమాను మజార్ రెండోవివాహం చేసుకున్నాడు. ఫాతిమాకు కూడా ఇది రెండోవివాహం. మజార్ మొదటి భార్య సంబంధించిన కేసు విషయమై ఇద్దరి మధ్య శనివారం ఉదయం గొడవ జరిగింది. మధ్యాహ్నం పెట్రోల్ తీసుకొచ్చి ఆటోలో పోస్తుండగా ఇద్దరిమధ్య మరోసారి మాటామాటా పెరిగింది. దీంతో ఇద్దరు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. తీవ్రంగా గాయ పడిన వారిని పోలీసులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. ఫాతిమా పెట్రోల్ డబ్బా తీసు కుని పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుందని మజార్ చెబుతుండగా, మజారే ఫాతిమాపై పోసి నిప్పంటించాడని ఫాతిమా కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా, ఎవరిపై ఎవరు పెట్రోల్ పోశారనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు మామునూరు సీఐ రవి కుమార్ తెలిపారు.


ఎంజీఎంలో చికిత్స పొందుతున్న మజార్, ఫాతిమా, పక్కన పెళ్లి నాటి చిత్రం